


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




గురువారం 20 ఆగష్టు 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3

## సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలి











భానుపురి/సూర్యాపేట టౌన్

జాతీయ రహదారి 65 గుండా యధావిధిగా సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పట్టణంలో రైల్వే సాధన సమితికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్, జువెలరీ , స్వర్ణకార సంఘం, మెడికల్ షాప్ ఇన్ కెమిస్ట్ అసోసియేషన్లు బుధవారం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భముగా వందే భారతి హై స్పీడ్ రైలు సౌకర్యం కల్పించాలని, జాతీయ రహదారి 65 వెంబటే రైల్వే లైన్ ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలు, అనేక పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైల్వే సౌకర్యం వస్తె సూర్యాపేట జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుం దని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ డేగల జనార్ధన్, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్. రమేష్ చంద్ర, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి ,జేఏసీ చైర్మన్ చింతలపాటి చిన్న శ్రీరాములు, కోఆర్డినేటర్ బిక్కుమల్ల ఉపేందర్, నరసయ్య, రాము, సముద్రాల రాంబాబు, వెంకట్ యాదవ్, మంజుల,నల్ల పాటి అప్పారావు, ఎల్. భద్రయ్య, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శు లు సల్వాది రమేష్ కుమార్ ఆనంద రావు , కోశాధికారి ఉపేందర్ సింగ్ ఐఎం ఎ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, సీనియర్ డాక్టర్లు దయాకర్ రెడ్డి, చంద్రశేఖర్, విజయమోహన్ ప్రేమ్ కుమార్, ఆనంద్ , శిరీష హర్ష, రాకేష్, సురేష్, రమేష్ నాయక్ శ్రీనివాసరెడ్డి, శ్రీరాంకుమార్, కిరణ్, సునీల్, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ కార్య దర్శి సింహాద్రి కోశాధికారి బూర్లె మధుసూదన్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు తొగిటి మురళి, సుదర్శన్, యమా ప్రభాకర్ , ముషం హరి, పలువురు ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ లో పాల్గొన్నారు.

## దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

### –డాక్టర్ తోట కిరణ్



భానుపురి /సూర్యాపేట

చిన్న దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే పెద్ద అనారోగ్యాలకు దారితీస్తాయని ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ తోట కిరణ్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల మణి దంత వైద్యశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరంలో డాక్టర్ టి.అలేఖ్యతో కలిసి ఆయన దంత పరీక్షలు నిర్వహించి మాట్లాడారు.పళ్ళలో నొప్పి, చిగుళ్ళ నుండి రక్తం రావడం, నోటి దుర్వాసన వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.క్రమం తప్పకుండా ఏడాదికి కనీసం రెండు సార్లు డెంటల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు.తీపి పదార్థాలు తినడం తగ్గించాలని,పొగాకు, గుట్కా వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.వివిధ దంత సమస్యలకు ప్రస్తుతం అనేక రకాల ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ హాస్పిటల్ నందు రెండు రోజులపాటు నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరాన్ని సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటాము



భానుపురి/సూర్యాపేట టౌన్

పేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటావని పలువురు ఆర్యవైశ్యులు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న వీర్లపాటి శ్రీనివాస్ కుమార్తె వీర్లపాటి జయశ్రీ కి ఉన్నత చదువులకు పేదరికం అడ్డంకి కావడం తో బుధవారం పలువురు సూర్యాపేట ఆర్యవైశ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రతి ఆర్యవైశ్యుడు సహకరించాలని అన్నారు. ప్రతిభ గల విద్యార్థుల చదువులకు పేదరికం అడ్డుకావద్దని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థిని తండ్రి వీర్లపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ తన కుమార్తె ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు బండారు రాజా, శ్రీ వాసవి సేవా సమితి ఉపాధ్యక్షులు పోతుగంటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం ఉపాధ్యక్షులు వెంపటి శబరినాథ్ శ్రీ వాసవి సేవాసమితి సభ్యులు చల్లా సత్యనారాయణ, ప్రతాపని చక్రధర్ , ఉప్పలంచు కృష్ణ ,చల్లా పాండయ్య, చిత్తలూరి శ్రీధర్ రావు, గుండా శ్రీధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



భానుపురి/సూర్యాపేట టౌన్

వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాప్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అనంతుల కృపాకర్, శనగాని రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, కమ్రుద్దీన్, వెంకన్న, చికూరి అశోక్, జగదీష్,సాయి, నిర్వాహకులు చికూరి లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో బుల్లెట్ ట్రైన్ పైతీర్మానము చేయాలి

భానుపురి/సూర్యాపేట

కేంద్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ప్రకారం శంషాబాద్ నుండి వయా సూర్యాపేట అమరావతి చెన్నై వరకు వెళ్లే విధంగా ప్రతిపాదనను కొనసాగించాలని మున్సిపాలిటీ ప్రత్యేక తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదిత కు వినతి పత్రం అందజేశారు. రెండు అలైన్మెంట్లు సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ అలైన్మెంట్లో మార్పు చేయడానికి ఆ మార్పులో సూర్యాపేట కు తీవ్ర అన్యాయం జరుగుతుందని మొదటగా ప్రకటించిన ప్రకారం బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట విధిగా వెళ్లే విధంగా ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని అఖిలపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నివేదిత మాట్లాడుతూ వర్తక వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలంటే సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లడమే సమంజసమని సభ్యుల అనుమతితో తీర్మానం చేసి వెళ్లే ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, మండాది డేవిడ్ కుమార్, జీడి బిక్షం, కర్ణాటి కిషన్, కొత్తపల్లి శివకుమార్ రేణుక, పేర్ల నాగయ్య, బూర వెంకటేశ్వర్లు, వీరేంద్ర, నేరెళ్ల మధు, ఎర్ర అఖిల్, భయ్యా మల్లికార్జున్, సట్టు నాగయ్య, సాయి ,అజయ్, తదితరులు పాల్గొన్నారు.



# బుల్లెట్ ట్రైన్ 6వ రోజు దీక్ష లో ఆర్యవైశ్యులు






భానుపురి/సూర్యాపేట

పోరాటాల గడ్డ సూర్యాపేటకు వర్తక వాణిజ్య వ్యాపార పరంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ కొనసాగించాలంటూ వర్తక వ్యాపారాల కు ఒక రోజు విరామం ప్రకటించి బుధవారం ఆర్య వైశ్యులు నిరాహార దీక్ష బాట పట్టారు. సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉండే ఆర్యవైశ్యుల వ్యాపారులు బుల్లెట్ ట్రైన్ సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామంటూ తమ గళమెత్తారు. సూర్యాపేట చుట్టూ రైలు మార్గాలు ఉన్నప్పటికీ దశాబ్దాలుగా రైలు మార్గం లేక రెండు రాష్ట్రాల రాజధానుల మధ్యలో ఉండి కూడా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నామని, రైలు మార్గం కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేసిన పట్టించుకోని నేతలకు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని ఆగ్రహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని శంషాబాద్ నుండి సూర్యాపేట మీదుగా అమరావతి, చెన్నైకి వెళ్లే విధంగా ప్రతిపాదన చేసిన రాష్ట్ర ప్రభుత్వం అలైన్మెంట్ మార్చి సూర్యాపేట నుండి వచ్చే బుల్లెట్ ట్రైన్ రాకుండా చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని మండిపడ్డారు. ముందుగా ప్రకటించిన ప్రకారం బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లే వరకు కేంద్ర



రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ ఉద్యమాన్ని తెలియజేసే విధంగా పోరాటం కొనసాగిస్తామని వారన్నారు. ఆర్యవైశ్యుల రిలే నిరాహార దీక్షకు సూర్యాపేట పట్టణ ప్రముఖులతో పాటు రాజకీయ వ్యాపార కుల ఉద్యోగ విద్యార్థి యువజన మహిళా సంఘాలు సంఘీభావం తెలిపారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ సాధన కోసం జరుగుతున్న 6వ రోజు రిలే నిరాహార దీక్ష లకు సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఆర్యవైశ్య నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, బండారు రాజా, తోట శ్యామ్ ప్రసాద్, పోతుగంటి వెంకటేశ్వర్లు, కలకోట లక్ష్మయ్య, వెంపటి శబరినాథ్, కర్నాటి కిషన్, ఈగ దయాకర్ గుప్త , ఈగవెంకటేశ్వర్లు, బొమ్మిడి లక్ష్మినారాయణ, వెంపటి సురేష్ , గుండా శ్రీధర్, వెంపటి పురుషోత్తం, తప్పి గాంధీ, గోంధ్రాల అశోక్, వంగవేటి రమేష్, బజ్జూరి శ్రీనివాస్, నవిలిపురి నరేందర్, బచ్చు పురుషోత్తం,చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పలువురి సంఘీభావం**

బుల్లెట్ ట్రైన్ నిరాహార దీక్షకు పాల్గొన్న ఆర్యవైశ్యుల పట్టణంలోని పలు పార్టీల నాయకులు సంఘాలు సంఘీభావం తెలిపారు . బుల్లెట్ ట్రైన్ వచ్చే ఉద్యమనేత కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి,పెద్దిరెడ్డి రాజా, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాపర్తి శ్రీనివాస్, సురేష్, గంగరాజు, డాక్టర్ రామ్మూర్తి, పెద్దిరెడ్డి గణేష్, ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, 8వ వార్డ్ కౌన్సిలర్ హిందూ శ్రీ,రమణాచారి, డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్ రేణుక, పేర్ల నాగయ్య, వనితక్క, శివ సాయి, వీరేంద్ర ,టిఆర్ఎస్ పార్టీ తరపున




గ్రంధాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, వై వెంకటేశ్వర్లు, జీడి బిక్షం, ఉప్పల ఆనంద్, అనంతల మధు, బయ్యా మల్లికార్జున్, లకుమారపుపద్మజ, నేరెళ్ల మధు,ఎర్ర అఖిల్, జర్నలిస్టులు వజ్జే వీరయ్య,గుండా శ్రీనివాస్ గుప్త, రాంబాబు, భూపతి రాములు, సురేష్, టీవీ9 శేఖర్, కందుకూరు యాదగిరి, కొండ శ్రీనివాస్,నాగయ్య, అలుగుబెల్లి వెంకటరెడ్డి, నల్గొండ నాగయ్య లు సంఘీభావం తెలిపారు.

# ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే

# ప్రక్రియలో సూర్యాపేట మహిళలు ముందు ఉండాలి






భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రక్రియలో సూర్యాపేట మహిళలు ముందు ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శక్తి ఉత్సవంలో భాగంగా వి హబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూట్ క్యాంప్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, పచ్చళ్ళు, జ్యూట్ బ్యాగులను పరిశీలించి అద్భుతంగా ఉన్నాయని అభినందించారు తదుపరి మహిళలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వస్తువులను తయారు చేసుకొని ఇంటి గడప దాటి ఇక్కడకు వచ్చిన మహిళామణులకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళామణులు అన్ని రంగాలలో ముందుండాలని మహిళా సంఘాలకు సూర్యాపేట జిల్లాలో 700 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగినదని, వాటిని ఇంటి ఖర్చులకు, విద్య, వైద్యం మీద ఖర్చు పెట్టకుండా ఏదో ఒక వ్యాపారం లేదా గ్రూపుగా ఏర్పడి యూనిట్ ఏర్పాటు చేసుకొని లాభాలు అర్జించుకొని మీ కాళ్ళ మీద మీరు ఉన్నత స్థానానికి ఎదగాలని, ప్రతి మండలం గ్రామం నుండి ఒక యూనిట్ రావాలని, కష్టపడే తపన మనలో ఉండాలని, మీరు మీ ఇంటి ఆదాయం పెంచుకోవాలని ఆశ, స్ఫూర్తి, తపన ఉంటే దానికి దారి తొలి అడుగు తీసుకోవాలి అంటే వి హబ్ మీకు అండగా ఉంటుందని, మహిళలు తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, మార్కెటింగ్ చేసుకోవడానికి వి హబ్ మీకు కావాల్సిన సలహాలు సూచనలు ఇస్తుందని, మహిళలకు సూర్యాపేటలో మహిళా శక్తి భవనం నిర్మాణం చేపడుతున్నామని త్వరలో దాన్ని ప్రారంభం చేసుకోవడం జరుగుతుందని. మీకు ఇంకేమైనా సందేహాలు సూచనలు ఉంటే సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 9391609994 నెంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని అలాగే ప్రొడక్ట్స్ తయారు చేయు మహిళలకు సంబంధించి వాట్సప్ గ్రూపు, వాట్సప్ ఛానల్ క్రియేట్ చేయవలసినదిగా డిఆర్డిఓ పి డి కి కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ పిడి సన్యాసయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటున్న వారి అందరిని ఒక గ్రూపుగా తీసుకొని వారిని అత్యున్నత స్థాయికి తీసుకుపోవు లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కావున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తదుపరి సి ఇ ఓ సీతా పళ్ళచుని మాట్లాడుతూ వి హబ్ మహిళల కోసం స్థాపించబడిందని చిన్న మార్కెట్ అనుకోకుండా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎలా ప్రొడక్ట్స్ ఎలా మార్కెట్ చేయాలో ఉపయోగించుకోవాలని, అవకాశాలు ఎలా ఉపయోగించుకోవాలో మీ మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ నరసింహారావు, అడిషనల్ డి ఆర్ డి ఓ పి డి సురేష్, డిపిఎం అరుణ్ కుమార్, ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు స్వయం సహాయక మహిళలు, వి హబ్ అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, టీం సభ్యులు పాల్గొన్నారు.

## పోస్ట్ డ్రాఫ్ట్ అప్లికేషన్ తర్వాత చేయవలసిన ప్రక్రియ గురించి

# దిశా నిర్ధారణ చేసిన జిల్లా కలెక్టర్

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీ నాయకులతో పోస్ట్ డ్రాఫ్ట్ కార్యకలాపాలు డ్రాఫ్ట్ పబ్లికేషన్ గురించి బుధవారం కలెక్టరేట్ వి సి హాల్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చర్చించడం జరిగింది.పోస్ట్ డ్రాఫ్ట్ అప్లికేషన్ అయిన తర్వాత చేయవలసిన ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించడం జరిగింది. సర్ లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ లిస్టులో ఏమైనా సందేహాలు ఫిర్యాదులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులకు డ్రాఫ్ట్ రోల్ అందించడం జరిగిందని, రాజకీయ పార్టీ ప్రతినిధులు రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రక్రియ సజావుగా జరుగుటకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుండి సిహెచ్ రాజేశ్వరరావు,బి జె పి నుండి చల్లమల్ల నరసింహ, ఎండి హాబిద్, బి ఎస్ పి నుండి ఎం.స్టాలిన్, బిఆర్ఎస్ నుండి సత్యనారాయణ, వైఎస్ఆర్సిపి నుండి డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఏఐటీయుసి రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయండి

## -మేకల శ్రీనివాసరావు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పిలుపు




భానుపురి/సూర్యాపేట టౌన్

సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు ఈరోజు సూర్యాపేట జిల్లా ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ లో సెప్టెంబర్ 6న జరుగుతున్న కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన స్పష్టమైన వైఖరితో అజెండాతో ముందుకు వెళుతున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అని, అలాంటి సంఘం మహా సభలను జయప్రదం చేయడం ద్వారా ఈ దేశంలో రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలకుల యొక్క పనితీరును మహా సభలో చర్చించి భవిష్యత్తు పోరాట కార్య క్రమంలో దిశా నిర్దేశం చేసే విధంగా ఈ మహాసభలు జరుగుతున్నాయని, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో నల్ల చట్టాలను ముందుకు తీసుకువస్తుందని, ఆ చట్టాలను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదనే విధంగా తీర్మానాలుచేపడతామని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు విధానానికి స్వస్తి చెప్పాలని, ఆర్టీసీ, సింగరేణి బొగ్గు గనుల సౌరక్షణకు ఏఐటీయూసీ ముందు ఉంటుందని ఆయన అన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనియెడల మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా గౌరవ సలహాదారులు శ్యామల అశోక్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారామ్, గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, ఎన్ కవిత, సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, కోశాధికారి ఎస్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

## -ఎంఎస్ఓ చాంబర్ దగ్ధం



కట్టంగూర్, ఆగస్టు 19 :

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించింది. కార్యాలయ సిబ్బంది అప్రమత్తతతో తీవ్రత తగ్గింది. కార్యాలయంలోని మండల ప్రత్యేక అధికారి చాంబర్లో ఏసిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. మాడిపోయినట్లు వాసన వస్తూ భారీగా పొగలు కమ్మడంతో అసలు ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో గంట అంజన్ రెడ్డి తో పాటు సిబ్బంది ఎంఎస్ఓ ఛాంబర్ లో షార్ట్ సర్క్యూట్ అయినట్లు గుర్తించి వెంటనే అప్రమత్తమై కిటికీలు తెరిపించడంతోపాటు ఎమ్మెఓ చాంబర్ ముందు ఉన్న కంప్యూటర్ విభాగంలోని కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్ తదితరాలను హుటాహుటిన అక్కడ నుండి తరలించారు. పొగల దాటికి కార్యాలయ సిబ్బంది బయటకి పరుగులు తీశారు. వెంటనే నకిరేకల్ లోని అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు వెంటనే చేరుకొని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఛాంబర్ లోని ఫర్నిచర్ దగ్ధం కావడంతో పాటు కార్యాలయం లోని కొన్ని గదులు పొగ చూరి నలుపెక్కాయి. సకాలంలో స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను తగ్గించగలిగామని కార్యాలయానికి సంబంధించిన ఫైల్స్ సురక్షితంగా ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

# తల్లి -- బతుకు బరువును మోసే మహాశక్తి

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి



తలపై బతుకు బరువు...
ఒడిలో పసిబిడ్డ...
అడుగుల్లో అలసట ఉన్నా
గుండెల్లో మాత్రం
బిడ్డ భవిష్యత్తుపై ఆశ!
తన కష్టాలను లెక్కచేయక
బిడ్డను గుండెలకు
హత్తుకుని జీవితపు
బాటలో సాగుతున్న
ఆ తల్లి అడుగులు
మన సమాజానికి ఓ ప్రశ్న!

ఆమె తలపై ఉన్నది
కేవలం మూట కాదు...
కుటుంబాన్ని నిలబెట్టే
బాధ్యతల భారం!
ఆమె చేతుల్లో ఉన్నది
కేవలం పసిబిడ్డ కాదు...
రేపటి సమాజం!

ఆమె చెమట చుక్కకు
గౌరవం దక్కాలి...
ఆమె బిడ్డకు భద్రమైన
బాల్యం దక్కాలి...
ఆమె కుటుంబానికి
బతుకు భారాలు తొలగి
బిడ్డల నవ్వులతో
ఆనందాల వెలుగులు
నిండిన రేపటి ఉదయం రావాలి
పేదరికం ఆమెను
వెంటాడవచ్చు...

కష్టాలు ఆమెను
వంచవచ్చు...
కానీ తన బిడ్డ కోసం
ఆమె ఆశ మాత్రం
ఎప్పటికీ చావదు!
తల్లి కష్టం కనిపిస్తే
కనికరం చూపడం
మాత్రమే కాదు...
ఆమె బతుకు మారేలా చేయూతనివ్వాలి!

తల్లి కన్నీరు తుడిచినప్పుడే
మన మానవత్వానికి అర్థం...
ఆమె బిడ్డ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినపుడే.......
మన సమాజ అభివృద్ధికి అర్థం!
తల్లి బలహీనురాలు కాదు...
బాధ్యతల బరువునే
బలంగా మోస్తున్న
మహాశక్తి!

ఆమె అడుగులకు
అండగా నిలుద్దాం...
ఆమె బిడ్డ భవిష్యత్తుకు
బాటలు వేద్దాం...
అప్పుడే సమాజం ధైర్యంగా
ముందుకు సాగుతుంది!

మిత్రాజి
( గుండవరం ప్రభాకర్ రావు పంతులు )









# వీడిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ

- -కీలకంగా మారిన బాబు అనే పదం
- -స్కూల్లో టెన్త్ స్టూడెంట్స్ ఘాతుకం
- -హత్య నుంచి తప్పించుకునేందుకు సోషల్ మీడియాలో సెర్చ్
- -5 ప్రత్యేక బృందాలు.. 40 మంది పోలీసుల
- -80 మందికి పైగా అనుమానితుల విచారణ
- -30 కి.మీ. పరిధిలో 70 సీసీ కెమెరాల ఫుటేజ్ ల పరిశీలన పరిశీలన
- -ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్
- -రూ. 1.54 లక్షల నగదు, మూడు సెల్ ఫోన్లు, కత్తి, గ్లౌజ్, మాస్క్ ల స్వాధీనం
- -ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్స్ డాగ్ స్క్వాడ్, సాంకేతిక ఆధారాలే కీలకం
- -కేసు వివరాలను మీడియా వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

భానుపురి/ నల్గొండ :

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి లో ఈ నెల 11న జరిగిన నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి(45) హత్య కేసు మిస్టరీ వీడింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ టెన్త్ విద్యార్థులే నిందితులని పోలీసుల విచారణలో తేలింది. స్కూల్ హాస్టల్ లో ఉంటూ డబ్బుతో పట్టుబడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్ వారి తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో కక్ష పెంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. దీంతో పాటు జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసగా మారిన విద్యార్థులు ప్రిన్సిపాల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించి హత్యకు పథకం రచించినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ రూపా రెడ్డి హత్య కేసు వివరాలను వెల్లడించారు.

### హత్యకు ముందు రెక్కీ

ఇద్దరు విద్యార్థులు ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుతూ హాస్టల్లో ఒకే గదిలో ఉంటున్నారు. జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడటంతో పాటు తల్లిదండ్రులకు తెలియకుండా సెల్ ఫోన్లు వినియోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్ లో సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను సెర్చ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఇటీవల హాస్టల్లో డబ్బుతో పట్టుబడటంతో రూపారెడ్డి తల్లిదండ్రుల సమక్షంలో వారిని మందలించినట్లు పోలీసులు చెప్పారు. సులభమైన రీతిలో డబ్బు సంపాదన... అదే సమయంలో ప్రిన్సిపాల్ పై కోపంతో పాటు ఆమె వద్ద పెద్ద ఎత్తున డబ్బు ఉంటుందని నిందితులు హత్యకు వారం రోజుల ముందు నుంచే రూపారెడ్డి కదలికలను గమనించి హత్య చేసినట్లు పోలీసులు చెప్పారు.

### కత్తి, గ్లౌజ్ లు కొనుగోలు

రూపారెడ్డి స్కూల్ నుంచి ఇంటికి చేరుకునే సమయానికి ముందే సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన విద్యార్థుల్లో ఒకరు బ్యాగులో ఎరుపు రంగు హుడీ, ప్యాంట్ తీసుకుని వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరూ కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. ఒకరు బయట ఉండి ఎవరైనా వస్తున్నారా అని గమనించగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించారు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది మార్గం ద్వారా ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డిపై కత్తితో పాశవికంగా దాడి చేసి హత్య చేసినట్లు చెప్పారు.

### రూ. 2.50 లక్షలతో పరారీ

నిందితులు హత్య అనంతరం ఇంట్లో ఉన్న సుమారు రూ.2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి పరారైెట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్ ఫోన్, చెట్ల పొదల్లో పడేసి... ఆ తర్వాత బట్టలు మార్చుకుని ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు చెప్పారు.

### 'బాబు' ఆ పిలుపే కేసులో కీలక క్లూ

రూపారెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక మలుపు 'బాబు' అన్న పిలుపు కేసులో కీలక క్లూ గా మారింది. హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్ లో సంభాషిస్తున్న వేళ చివరగా 'బాబు' అని పలికారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో... ఆమె ఎవరిని ఉద్దేశించి 'బాబు' అన్నది అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే రూపారెడ్డి పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా 'బాబు' అని పిలిచేవారని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు. ప్రిన్సిపాల్ హత్యతో పాఠశాలకు వరుసగా ఆరు రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో విచారణ ఆలస్యమైంది. కాగా స్కూల్ మళ్లీ ప్రారంభమైన అనంతరం విద్యార్థులను ఒక్కొక్కరిని విచారించారు. స్కూల్ ప్రారంభమయ్యాక విద్యార్థులు ఎవరు గైర్హాజరయ్యారు అన్న విషయంలోనూ పోలీసులు విచారణ చేసి నిందితులను గుర్తించారు. హత్య జరిగిన స్థలం నుంచి 30 కిలోమీటర్ల వరకు సీసీ ఫుటేజ్ లను పరిశీలించిన పోలీసులు రూపారెడ్డి హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాల కోసం వెతికారు. హత్య జరిగిన స్థలం నుంచి సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను, సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజిలను రేయింబవళ్లు క్షుణ్ణంగా పరిశీలించి కేసును చేదించారు.

### కేసు విచారణలో ఐదు ప్రత్యేక బృందాలు... 40 మంది పోలీసులు

అనేక రకాల అనుమానాలకు అవకాశం ఉన్న ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య కేసులో మొదట ఎలాంటి క్లూ దొరకలేదు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన పోలీసులకు సవాల్ విసిరిన ఈ కేసులో ఐదు ప్రత్యేక బృందాలు, 40 మంది పోలీసులు రంగంలోకి దిగారు. కాగా రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొందరు విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వారిలో జల్సాలకు అలవాటుపడిన కొందరిని అనుమానించి నిఘా పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజిల్లో లభించిన ఆధారాలు అనుమానిత విద్యార్థులపై ఫోకస్ చేశారు.

### పెండ్లిపాకల క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడిన నిందితులు

పెండ్లిపాకల క్రాస్ రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు వెళు తున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దొనియాల క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి తనిఖీ చేశారు. వారి వద్ద రూ.1.54 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అందులో మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విద్యార్థులను ప్రశ్నించడంతో రూపారెడ్డిని హత్య చేసి నగదు దొంగిలించినట్లు విద్యార్థులు చెప్పారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, మృతురాలి సెల్ ఫోన్, మరో రెండు సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజ్ లు, మాస్కులు స్వాధీనం చేసుకొని నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

### నిందితులిద్దరూ మైనర్లే

నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్లో చదువుతున్న నిందితులు మైనర్లేనని ఎస్పీ తెలిపారు.

### కేసును చేదించిన అధికారులను అభినందించిన ఎస్పీ

కేసును ఛేదించడంలో దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మల్లేపల్లి సీఐ ఏ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, ఎస్ఐలు, సీసీఎస్ సిబ్బంది కీలకంగా పనిచేశారు. ప్రత్యేక బృందాల కృషిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.